ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు ఎమ్మెల్సీని కలిసి సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా అధికారులు పని చేయాలన్నారు.

పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఇంద్రాజిత్ రెడ్డి, పద్మారెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, నాగిరెడ్డి, యువకిరణ్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లించాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్

నిజాంపేట్: మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే కార్మికులతో వార్డు కార్యాలయం వద్ద మాట్లాడారు. రెక్కాడితే కానీ డొక్కాడని కార్మికులకు ప్రతి నెల జీతం ఆలస్యంగా ఇస్తే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గయ్య, యాదయ్య, నర్సమ్మ, సత్తమ్మ, యాదమ్మ, పుష్పమ్మ, కృష్ణ, రాజు, నాగయ్య, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు బిగిస్తే.. కనెక్షన్ కట్!

నల్లాలకు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని అక్రమంగా తోడేయడంపై జలమండలి అధికారులు దృష్టి సారించారు. అలాంటి వాటిని అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మోటార్లు బిగిస్తే వాటిని స్వాధీనం చేసుకొని జరిమానా కూడా విధిస్తున్నారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తప్పవని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు కుత్బుల్లాపూర్ డివిజన్ 12లో 16 మోటార్లు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల పేరుతో జరిమానా విధిస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సంపులో బిగించిన మోటార్‌ను గుర్తించిన అధికారులు

- నల్లాలకు బిగించిన మోటార్లపై జలమండలి నజర్
- మోటార్ ఫ్రీ ట్యాప్ స్పెషల్ డ్రైవ్
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



మోటార్‌ను సీజ్ చేసిన అధికారులు

చింతల్: తాగునీటి నల్లాలకు మోటార్ల బిగించి అక్రమంగా నీటిని తోడుకుంటున్న వినియోగదారులపై జలమండలి అధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి మోటార్ ఫ్రీ ట్యాప్ ద్వారా జలమండలి అధికారులు స్పెషల్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్ ఆధ్వర్యంలోని ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని పలు సెక్షన్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నీటి సరఫరా జరుగుతున్న సమయంలో మోటార్ల ద్వారా నీటిని తోడుతున్న వారిని, అదే విధంగా నీటి వృథా చేసి తమ వాహనాలకు నీటిని కొట్టడం, అదే విధంగా జలమండలి సరఫరా చేసే నీటితో కొంతమంది ఇళ్ల ముందు కడగడం, రోడ్డు మీద వదిలేయడం వంటి వాటిని గుర్తించి చలాన్‌లు విధిస్తున్నారు. మోటార్లను బిగించిన వారి నుంచి మోటార్లను స్వాధీనం చేసుకొని జరిమానాను విధిస్తున్నారు. దీంతో గత మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో 16 మోటార్లను సీజ్ చేసి పలువురు వినియోగదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై అక్రమంగా మోటార్లను బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీఎం అశోక్ హెచ్చరించారు.

అధికారులపై మండిపడుతున్న ప్రజలు

ఒక ప్రాంతంలో రెండు రోజులకు ఒకసారి, మరి కొన్ని ప్రాంతాల్లో ఐదు రోజులకు, మరికొన్ని ప్రాంతాల్లో 7 నుంచి 8 రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా వారానికి ఒకసారి వచ్చేవారు నీటిని ఎక్కువ భాగం పొదుపు చేసుకునేందుకు మోటార్లను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కానీ జలమండలి అధికారులు మోటార్లను బిగిస్తే మోటార్లను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధిస్తున్నారు. రెండు రోజులకు ఒకసారి వచ్చే నీరు అదే విధంగా వారానికి వచ్చేవారికి వచ్చే నీరు ఎలా వారికి సరిపోతాయని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులకొకసారి వచ్చే వారికి మోటార్లను బిగించకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి వారం రోజులకు ఒకసారి వచ్చే ప్రాంతాలలో అధికారులు దాడులు చేయడం సరికాదంటున్నారు. ప్రిన్సెస్ సర్టిఫికెట్ల పేరుతో బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఉచిత నీరు అందించి మధ్యతరగతి ప్రజలపై ట్రిపుల్ టైం పేరుతో ఇప్పటికే అధిక బిల్లులు వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఇంటికి నీటి సరఫరా లక్ష్యం

కుత్బుల్లాపూర్ లో ఇప్పటికి 2016–18లో కేటాయించిన 23 ఎంజీడీల నీరు మాత్రమే సరఫరా అవుతుంది. కానీ నాటి నుంచి నేటికీ కుత్బుల్లాపూర్‌లో సుమారు మరో రెండున్నర నుంచి 3 లక్షల మేర జనాభా పెరిగింది. అనేక కాలనీలు వెలిశాయి. అందుకు అనుగుణంగా నీటి కేటాయింపు 23 ఎంజీడీ నుంచి సుమారు 35 ఎంజీడీ వరకు నీరు పెంచుకోవాల్సిన పరిస్థితి ఉంది. పెరిగిన జనాభాకు సరిపడా నీరు లేకపోవడంతోనే కొన్ని ప్రాంతాల్లో అటు ఇటుగా ప్రతి ఇంటికి నీరు వచ్చేలాగా చర్యలు తీసుకుంటున్నాం. మోటార్ల ద్వారా నీటిని తోడితే మాత్రం కఠిన చర్యలు తీసుకొని మోటార్లను సీజ్ చేసి జరిమానా విధిస్తాం. – అశోక్, జలమండలి జీఎం, కుత్బుల్లాపూర్

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ శ్రీనివాసనగర్ కాలనీలోని శ్రీనివాస అభయాంజనేయస్వామి దేవస్థానంలో భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 17వ తేదీ నుంచి ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి. శుక్రవారం ప్రబంధ పారాయణం, నిత్య హోమం, ధ్వజారోహణం, అష్టదిగ్బంధనం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సైతం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, ఇందిరా, మేడ శ్రీనివాసరావు, ఏవీరావు, రాఘవేందర్‌రావు, ఆంజనేయవర్మ, మధుకర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్ శ్రీని ఎన్‌క్లేవ్ గేట్ 2లో నూతనంగా ప్రారంభమైన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అదే విధంగా గేట్ 02 రోడ్డులో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనుల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట రాకేశ్ రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, పెద్దిరెడి, నవోదయరెడ్డి, శ్రీధర్ రెడ్డి, గంగాధర్, కిషన్‌రెడ్డి, నైనీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రాగా టూల్స్ కాలనీలో భరతసింహారెడ్డికి స్థానిక ప్రజలు రోడ్డు సమస్యతో పాటు తాగునీటి ఎద్దడిని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్ : 11కేవీ కోకో కోలా, 11కేవీ వోల్వో ఫీడర్‌లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సాయి అనురాగ్ కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీ, కౌసల్య కాలనీ, కెన్నెడి స్కూల్ రోడ్డు, శ్రీ హోమ్స్ కాలనీ, మా విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు. మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో.. మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ గోకరాజు రంగరాజు ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు గోకరాజు కళాశాల రోడ్డు, మియాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ కొత్త కాలనీ ఫీడర్‌లో ఉదయం 9:30 నుంచి 10 గంటల వరకు కొత్త కాలనీ, లక్ష్మీనగర్‌లో, మయూరి నగర్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్‌లో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు లక్ష్మీనగర్, దోవా కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్డు, వికాస్ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కేంద్రీయ విహార్ ప్రాంతం, రత్నదీప్ వెనుక వైపు అలాగే 11కేవీ హెచ్‌ఎంటీ సబ్‌స్టేషన్ నుంచి నందమూరి నగర్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు హోలిస్టిక్ హాస్పిటల్, నిజాంపేట్ ప్రధాన రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దుర్గా ఎస్టేట్స్ 10:30 నుంచి 11 గంటల వరకు దుర్గా ఎస్టేట్స్, వెన్నెలగడ్డ, భజరంగ్ హిల్స్, వసంత్ విహార్ అపార్ట్‌మెంట్స్, 11కేవీ గాయత్రి నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి 10 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్, 11కేవీ సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు సెయింట్ ఆన్స్ స్కూల్, రెనోవా ఆసుపత్రి, శ్రీసీ ఎవెన్యూ, 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3:30 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, హర్షా ఆసుపత్రి లేన్, డిమార్ట్ వెనుక వీధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

కొంపల్లి సెక్షన్‌లో..

◆ 11కేవీ దూలపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3:30 గంటల వరకు సాయిబాబా ఆలయం, గ్రామ పంచాయతీ ఏరియా, ఎస్సీ కాలనీ, మహాలక్ష్మి లేఅవుట్, రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్, అశోకా ఏ మైసన్, 11కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 9:30 గంటల వరకు హరియానా జంట స్వామి ఇండస్ట్రీస్, వెంకటరమణ కాంట, 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3:30 గంటల వరకు జయభేరి శివాలయం రోడ్డు, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలనీ, 11కేవీ విగ్నేశ్వర ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు కేవీఆర్ గార్డెన్ రోడ్డు, కేవీర్ గార్డెన్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

దళిత రత్న అవార్డుకు ఎంపికైన వారికి సత్కారం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ప్రకటించిన దళిత అవార్డుకు ఎంపికైన పలువురు శుక్రవారం పేట్‌బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిశారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. వారికి ఎల్లప్పుడు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ మెంబర్ మేకల నాగేష్, దళిత రత్న అవార్డు గ్రహీతలు డప్పు రామస్వామి, జోగు వెంకట్, బండ మహేందర్, అమృతయ్య, అబ్రహం, నాగులు, ఉప్పలయ్య, యేసు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం శివాలయనగర్‌కు చెందిన సుంగరాల అజయ్(34)కు 2015లో సూరారం కృషి కాలనీకి చెందిన శృతితో వివాహమైంది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆరు నెలలుగా వేరుగా ఉంటున్నారు. అంజయ్ కొంత కాలంగా బేగంపేట్‌లో నివాసముంటూ నెల రోజుల క్రితమే శివాలయనగర్‌కు వచ్చాడు. గురువారం సాయంత్రం అతను ఉంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు పోలీసులు సమాచారం అందించారు. తలుపులు బద్దలకొట్టి లోనికి వెళ్లి చూడగా.. అజయ్ మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎందుకిలా చేశావమ్మా!

- చిన్నారుల అంతరంగ ఆవేదన
- గుండెల్ని పిండేసిన జీడిమెట్ల ఘటన



తేజస్విని



అశిష్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

ఎందుకమ్మా.. ఇంత దారుణానికి ఒడిగట్టావు. గోరుముద్దలు తినిపించి.. అల్లారుముద్దుగా పెంచి.. అనురాగాన్ని పంచి నీ ప్రాణానికి ప్రాణంగా చూశావు. కానీ.. ఇంతలోనే మా ప్రాణాలు తీసి నీవూ చనిపోయావెందుకమ్మా! కష్టమొస్తే నాన్నకు చెబితే తీర్చేవాడు కదా. మాకు ఆరోగ్య సంబంధ సమస్యలు, నీకూ అనారోగ్యం .. వీటిని తట్టుకోలేక నీ ఇద్దరు పిల్లల ఊపిరి తీశావు. మేమేం పాపం చేశామమ్మా.. అంటూ ఆ ఇద్దరు చిన్నారి బాలురు తమ హృదయావేదనను ఇలాగే వెలిబుచ్చేవారేమో! గురువారం జీడిమెట్ల పీఎస్ పరిధిలోని బాలాజీ లే అవుట్‌లో తల్లి తేజస్విని తన ఇద్దరు కుమారులు ఆశిష్‌రెడ్డి (7), హర్షిత్‌రెడ్డి (5)లను వేట కొడవలితో నరికి.. ఆ తర్వాత అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందికి దూకి తానూ ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ విషాదాంత ఘటనతో స్థానికులను కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు ఈ దారుణాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. శుక్రవారం పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలే కనిపించాయి. ఆ కుటుంబంలో తీరని శోకమే నిండుకుంది. మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతోనే తేజస్విని ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టిందని స్థానికులు చెబుతున్నారు. మాతృమూర్తి ఆదిలోనే ఇలా తమ ప్రాణాలను తీస్తుందని ఊహించే స్థితిలో లేని ఆ ముక్కుపచ్చలారని ఆమె ఇద్దరు కుమారులు ఆఖరి ఘడియల్లో ఎంతటి క్షోభ అనుభవించారో.. పాపం పసి పిల్లలు! – జీడిమెట్ల

రోడ్డు పక్కనే చెత్త.. పట్టించుకోని సిబ్బంది



వాణినగర్ వెళ్లే రోడ్డులో పోగైన చెత్త

ప్రధాన రోడ్డుపైన చెత్త పోగైనా సిబ్బంది తరలించడం లేదు. వాణినగర్ నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఇలా చెత్తా చెదారం పేరుకుపోయి కంపు కొడుతుంది. ప్రతి రోజు సిబ్బంది ఇక్కడ రోడ్లను ఊడ్చి చెత్తను పోగు చేసి వెళ్తున్నారే తప్ప వాటిని తరలించడం లేదు. అంతేకాకుండా ఇళ్లల్లో సేకరించే చెత్తను సైతం ఇక్కడే వేసి వెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి చెత్తను ఇక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు. – కుత్బుల్లాపూర్

అక్రమ నిర్మాణాలపై నజర్!

శివారు మున్సిపాలిటీల్లో భవనాలు, వ్యాపార సముదాయాల గుర్తింపునకు చర్యలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో కొనసాగుతున్న లెక్కింపు ప్రక్రియ
- రికార్డులు, నిర్మాణ వ్యత్యాసాలపై ప్రత్యేక దృష్టి
- నిర్లక్ష్యం వహిస్తున్న 'పుర' సిబ్బందికి తాఖీదులపైనా కసరత్తు



మైసమ్మగూడలో నిర్మాణాలు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పట్టణాల్లోని అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్రమంగా నిర్మించిన ఇళ్లు, బహుళ అంతస్తులు, వ్యాపార వాణిజ్య సముదాయాల జాబితా పంపాలని రాష్ట్ర పురపాలిక శాఖ అధికారులు ఆదేశించడంతో నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రక్రియను ప్రారంభించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో అనుమతుల్లేని నిర్మాణాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది.

ప్రత్యేక జాబితాలోకి..రికార్డుల్లో లేని ఇళ్లు

పట్టణాల్లో రికార్డు పరంగా ఉన్న ఇళ్లకు, వాస్తవంగా ఉన్న నిర్మాణాలకు వ్యత్యాసం ఉండడంతో ఆ దిశగా లెక్కింపు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వార్డులు/డివిజన్ల వారీగా ఇళ్ల జాబితాను తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రికార్డుల్లో లేని నిర్మాణాలను ప్రత్యేక జాబితాలో నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా భవన నిర్మాణాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్నప్పటికీ మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో ఇప్పుడు అవి సంబంధిత అధికారుల దృష్టికి చేరుతున్నట్లు తెలుస్తోంది. 2, 3 అంతస్తులున్న వారు, పెద్ద భవనాలున్న వారు సైతం తమకు ఒక అంతస్తు మాత్రమే ఉందని రికార్డులో నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటివి కూడా లెక్కింపుల్లో బయట పడుతున్నాయి.



పోచారంలో..

చర్యలు ఇలా..

◆ పురపాలక సంఘాల గుర్తింపు ప్రక్రియలో అనుమతుల్లేని నిర్మాణమని తేలితే ఎన్నేళ్ల క్రితం కట్టారో వివరాలు సేకరిస్తారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎంతమేర పన్ను అవుతుందో ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

◆ ఒకే అంతస్తు అనుమతి తీసుకుని 2, 3 అంతస్తులు నిర్మించుకున్న వారికి కూడా ఇదే నిబంధన వర్తిస్తోంది.

◆ సర్వేలో ఇంటికి సంబంధించి పూర్తి వివరాలు, ప్లాటు విస్తీర్ణం, ఇంటిని నిర్మించిన స్థలం, ఖాళీ స్థలం ఎంత ఉంది అనేది గుర్తిస్తున్నారు.

◆ కొత్తగా నిర్మించుకుంటున్న వాటిని పరిశీలించి అనుమతి లేకపోతే నిర్మాణాన్ని నిలిపేయాలని యజమానికి ఆదేశాలిస్తారు.

పకడ్బందీగా..

పురపాలక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నప్పటికీ, ఇందులోనూ రాజకీయ నాయకుల జోక్యం ఉంటున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని పరిశీలించడంతో పాటు బయటపడిన నిర్మాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నా.. ఇందులో కూడా దాగుడు మూతలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

3,691 అక్రమ నిర్మాణాల గుర్తింపు!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఇప్పటివరకు 3,691 అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఘట్‌కేసర్ మండలం పరిధిలోని మున్సిపాలిటీల్లో 676, దుండిగల్ పరిధిలో 1962, కీసర మండలంలోని మున్సిపాలిటీల్లో 669, తూంకుంట పరిధిలో 206, మేడ్చల్ మండల పరిధిలోని మున్సిపాలిటీల్లో 206, నిజాంపేట్ కార్పొరేషన్‌లో 76, కొంపెల్లి మున్సిపాలిటీలో 42, మేడిపల్లి మండల పరిధిలోని పురపాలక సంఘాల్లో 78, జవహర్‌నగర్‌లో 68 అక్రమ కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సంఖ్య 1.68 లక్షలు కాగా, 13 పురపాలక సంఘాల పరిధిలో అనుమతుల్లేని భవనాలు, వ్యాపార సముదాయాలు వందల్లోనే ఉంటాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని ఓ పురపాలక సంఘంలో తాజా మాజీ వైస్ చైర్మన్ 2 అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని.. 4 అంతస్తులు నిర్మించినట్లు తెలుస్తోంది. మిగతా పురపాలక సంఘాల్లో కూడా మాజీ , తాజా ప్రజాప్రతినిధులకు సంబంధించిన భవనాల అక్రమ బాగోతం బయట పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా పురపాలక సంఘాల్లోని టౌన్‌ప్లానింగ్ అధికారులతో సహా కమిషనర్లకు తెలిసినా.. చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని స్థానికులు, పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు , సమాచార హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. చెరువులు, కుంటలు, మురుగు కాలువలు, రోడ్లతో సహా ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి భవనాలను నిర్మించినా రెవెన్యూ, పుర, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029